క్లుప్తంగా

గట్టు భక్తులకు అల్పాహారం



బన్ని ఉత్సవానికి వెళ్లి వస్తున్న భక్తులకు అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

హొళగుంద: దేవరగట్టు దసరా బన్ని ఉత్సవానికి వెళ్లి తిరిగి వస్తున్న కర్ణాటక, ఇతర ప్రాంతాల భక్తులకు బుధవారం ఉదయం హొళగుందకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బకాడి సోమిరెడ్డి, దొడ్డబసప్ప, హొళగుంద వైస్ సర్పంచ్ మీనాక్షి ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, తాగునీటిని అందించారు. ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాల్లో భక్తులకు ఒక రోజు అల్పాహారం అందించడం ఆనవాయితీగా వస్తోంది. బుధవారం వేలాది మంది భక్తులకు అల్పాహారం, తాగునీటిని అందించారు. ఉత్సవానికి హాజరైన భక్తులు శిబిరంలో అల్పాహారం స్వీకరించి కాసేపు సేదతీరి తమ గ్రామాలకు వెళ్లారు.

'ప్రజా రక్షణ భేరి' పోస్టర్ ఆవిష్కరణ

తుగ్గలి: అసమానతలు లేని అభివృద్ధి కోసం నిర్వహించే ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం తుగ్గలిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. ఈనెల 30వ తదీన ఆదోని నుంచి బస్సు యాత్ర ప్రారంభమై మధ్యాహ్నం పత్తికొండ అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకుని అక్కడే సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

ముగిసిన దసరా ఉత్సవాలు



వెల్దుర్తిలో అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): పది రోజులుగా వెల్దుర్తి పట్టణంలో జరిగిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని మ్యాదర వీధి వెనుక ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి విగ్రహానికి పది రోజులుగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి పట్టణ పురవీధుల గుండా ఊరేగించి హంద్రీ–నీవా కాలువలో నిమజ్జనం చేశారు.

ఇంటిని కూల్చేస్తున్నారని ఫిర్యాదు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన మద్దిలేటమ్మ ఇంటిని గ్రామానికి చెందిన మహానంది అతని కుమారులు నెట్టికంఠయ్య, శ్రీరాములు కూల్చేస్తున్నారని బుధవారం బాధితురాలి కూతురు కృష్ణవేణి పత్తికొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వృద్ధురాలైన తల్లి మద్దిలేటమ్మ యోగక్షేమాలు చూస్తూ కృష్ణవేణి అదే ఇంట్లోనే ఉంటోంది. ఇంటి పక్కన కొత్తగా ఇంటి నిర్మాణం చేస్తూ దౌర్జన్యంగా గోడను గడ్డపారలతో పెకిలించారు. ప్రశ్నించిన తనపై దాడి చేశారని కృష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి పంపి కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపాల్ తెలిపారు.

హద్దు రాళ్లు వచ్చేశాయ్



మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న భూరక్ష పథకానికి సంబంధించి సమగ్ర సర్వే పూర్తయిన గ్రామాల్లో పొలాల హద్దులు ఏర్పాటు చేసేందుకు బసినేపల్లి గ్రామానికి 1200 హద్దు రాళ్లు వచ్చాయని మార్కెట్‌యార్డు డైరెక్టర్ భద్రయ్య బుధవారం తెలిపారు. త్వరలోనే రెవెన్యూ అధికారులు పొలాలకు హద్దు రాళ్లు పాతించే పనులు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే భూవివాదాలు పూర్తిస్థాయిలో పరిష్కారమవుతాయని వెల్లడించారు.

సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్ సీజన్‌లో సరైన వర్షాలు లేక పంటలు ఎండిపోవడంతో గ్రామాల్లో వ్యవసా య పనులు లేక కూలీలు పొట్టకూటి కోసం వలస వెళుతున్నారని, వారి పిల్లల కోసం సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు, మంత్రాలయం, దేవనకొండ, ఆస్పరి, ఆలూరు, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, సి.బెళగల్ మండలాల నుంచి వలసలు పెరిగిపోయాయన్నారు. తల్లిదండ్రులు వలస వెళుతుండడంతో వారి పిల్లలు విద్యకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అలాంటి విద్యార్థుల కోసం జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

కృష్ణగిరి: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అందరం సమష్టిగా కృషి చేసి రాష్ట్ర భవిష్యత్తు కోసం మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. బుధవారం కృష్ణగిరిలోని సహకార సొసైటీ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణితో కలిసి ఆమె వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలకు 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు సీఎం కావాలంటే' కార్యక్రమంపై శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలి

టీడీపీ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, వైఎస్సార్‌సీపీ పాలనలో పత్తికొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. 2014 ఎన్నికలకు ముందు బీజేపీ, జనసేన పొత్తుతో టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను కనుమరుగు చేసిన విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేసిన విధానాన్ని ఇంటింటికీ వెళ్లి చెప్పి వారిని చైతన్యం చేయాలన్నారు. గత చంద్రబాబు పాలన, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో తేడాను వివరించి, ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజల సొమ్ము కాజేసిన చంద్రబాబు

ప్రజల సొమ్ము దుర్వినియోగం చేశాడు కాబట్టే చంద్రబాబు జైలుకు వెళ్లాడని ఎమ్మెల్యే విమర్శించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

మనం రైతులకు మంచి చేయాలనుకున్నాం కాబట్టే ఆలంకొండ సమీపంలో 68 చెరువులకు నీటిని మళ్లించే పథకాన్ని పూర్తి చేసి ప్రారంభించామన్నారు. అనంతరం ప్రగతి మండల వికలాంగుల సమాఖ్య సభ్యులు తమ సంస్థకు కార్యాలయం నిర్మించుకునేందుకు ఐదు సెంట్ల స్థలాన్ని చూపాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, యూత్ కన్వీనర్ లక్ష్మీకాంత రెడ్డి, మండల కో–ఆప్షన్ మెంబర్ నక్కషాలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

తుగ్గలి: మండల పరిధిలోని బొందిమడుగులకు చెందిన షకీలా కుమారుడు ఇంతియాజ్‌బాషా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఇంతియాజ్‌బాషా పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే వైద్య సాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. దీంతో ఆ యువకుడికి వైద్య ఖర్చుల నిమిత్తం కింద రూ.2 లక్షలు మంజూరైంది. బుధవారం ఎమ్మెల్యే చెక్కు అందజేయడంతో ఆ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

'ఆరోగ్య సురక్ష'.. ఓ సువర్ణాధ్యాయం

కృష్ణగిరి: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం' ఓ సువర్ణాధ్యాయమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని ఎరుకలచెరువు గ్రామంలో ఎంపీడీఓ విశ్వమోహన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టి ప్రభుత్వ



ఎరుకలచెరువు శిబిరంలో సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

సొమ్ముతో కార్పొరేట్ వైద్యం అందించి ఎంతో మంది ప్రాణాలను కాపాడి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ఆయన బాటలోనే తనయుడు వైఎస్ జగన్ పేదల ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ చూపుతూ గ్రామాలకే వైద్య బృందాన్ని పంపి, ఏడు రకాల ఆరోగ్య పరీక్షలు చేయించి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. సురక్ష శిబిరంలో 490 మందికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి, ప్రహ్లాద, పరుశరాముడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మద్దికెర: మండల పరిధిలోని బొజ్జనాయునిపేట గ్రామంలో నీటి సమస్య పరిష్కరించేందుకు వేయించిన బోరులో నీరు పుష్కలంగా పడడంతో ప్రజలు, నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇటీవల ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు బోరు వేయించినట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, పంచాయతీ సలహాదారు అంజనేయులు అన్నారు. బోరులో పుష్కలంగా నీరు పడడంతో తాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. ఇప్పటికే గ్రామంలో ఇంటింటికీ కొళాయి పనులు జరుగుతున్నట్లు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

ఆలూరు: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు భూపేష్, నియోజకవర్గ నాయకుడు చంద్రకాంత రెడ్డి డిమాండ్ చేశారు. ఆలూరు మండలంలోని మొలగవెల్లి గ్రామ ఏఐటీయూసీ కార్యాలయం వద్ద బుధవారం మండల నాయకుడు రంగన్న ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భూపేష్ మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో వర్షధారంపై పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పులపాలయ్యారన్నారు. కరువు నుంచి రైతులను గట్టెంకిచాలని, విద్యార్థులకు ఫీజు రాయితీ ప్రకటించాలని కోరారు. నాయకులు రంగన్న, నరేంద్ర, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని కల్లుబావి వీధికి చెందిన ఓ యువతి బుధవారం ఆత్మహత్యకు ప్రయత్నించింది. వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇంట్లోనే పురుగు మందు సేవించిందని, అందుకు కారణాలు తెలియాల్సి ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.

బెట్ట నివారణకు చర్యలు చేపట్టాలి

మద్దికెర: రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ పైర్లు వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండుతున్నాయని, రైతులు పంటను కాపాడుకోవాలని ఏఓ రవి సూచించారు. ఆయన బుధవారం స్థానిక పంట పొలాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బెట్ట తట్టుకోవడానికి 19-19-19 ఎకరానికి ఒక కిలో పిచికారీ చేసుకోవాలన్నారు. అదే విధంగా రబ్బరు పురుగు నివారణకు 2 గ్రాముల అసిపేట్ లీటర్ నీటికి లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లీటరు నీటికి లేదా ఇండాక్సకార్బ్ 1 గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. వడలు తెగులు నివారణకు సాఫ రెండు గ్రాములు లేదా అవాచ్ రెండు



పప్పుశనగ పైరును పరిశీలిస్తున్న ఏఓ రవి

గ్రాములు లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటిలో కలుపుకొని మొక్కలు తడిసే విధంగా పిచికారీ చేయాలన్నారు. ఏఈఓ బోజరాజు, వీఏఏ ఆనంద్ ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని బుధవారం మాధవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కిరణ్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. కోసిగి మండలం దొడ్డిబెళగల్ గ్రామానికి చెందిన మంజునాథ్‌గౌడ్ యూనికార్న్ బైక్‌పై కర్ణాటక మద్యం తరలిస్తుండగా మాధవరం తండా రోడ్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 384 ఒరిజినల్ చాయిస్ మద్యం టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్), బైకును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.



స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న ఎస్‌ఐ కిరణ్‌బాబు

వేధింపుల కేసు నమోదు

గోనెగండ్ల: మండల కేంద్రంలోని అచ్చుకట్ల వీధికి చెందిన బీబీ ఫాతిమా అనే వివాహితను భర్త, అత్త, మామ, మరిది అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురిచేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్లలోని అచ్చుకట్ల వీధికి చెందిన బీబీ ఫాతిమాకు, అదే గ్రామానికి చెందిన షేక్ సలీం బాషకు ఆరేళ్ల క్రితం వివాహం అయ్యింది. అయితే గత రెండు సంవత్సరాలుగా భర్త సలీం బాష, అత్త షేక్ మెహరిన్ బీ, మామ రసూల్‌సాబ్, మారిది షేక్ షఫీ రూ.2 లక్షలు వరకట్నం తేవాలని మానసికంగా, శరీరకంగా వేధిస్తున్నారు. బాధితురాలు ఫాతిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకుపై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు

అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలి

నందవరం: మండలంలో చేపట్టిన నాడు– నేడు, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఎంపీడీఓ దశరథరామయ్య ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల అధికారులు హాజరయ్యారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నాడు– నేడు పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవా లని ఎంఈఓలకు సూచించారు. అలాగే జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇంటి బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో నాడు– నేడు పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్లను ఆదేశించారు. పనుల్లో పురోగతి సాధించేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పర్యవేక్షించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఈఓ–2 రఘునాథ్, పీఆర్ ఏఈ జయన్న, ఆర్‌డబ్ల్యూఎస్‌ఏఈ వెంకటరాముడులు పాల్గొన్నారు.

జగనన్న విజయాన్ని ఎవరూ ఆపలేరు



హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌ను సన్మానిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

హొళగుంద: రానున్న ఎన్నికల్లో ఎన్నిపార్టీలు కలిసొచ్చినా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయాన్ని ఆపలేవని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. మంగళవారం రాత్రి దేవరగట్టు బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన ఆయన్ను ఆలక కమిటీ సభ్యులు, ఉత్సవ నిర్వాహకులు నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు. వీరనాగప్ప, సోమప్ప, అడ్వకేట్ మల్లికార్జునగౌడ్, చిన్న మల్లికార్జునగౌడ్, రవి, మంజునాథ్‌నాయక్, రాము నాయక్ తదితరులు గోరంట్ల మాధవ్‌కు శాలువ కప్పి సత్కరించారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజలకు చేసిన మేలే ఆయన విజయానికి సోపానాలని అన్నారు. ఎంత మంది గుంపు కట్టి వచ్చినా ప్రజల మద్దతు జగనన్నకే ఉంటుందని చెప్పారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో రజతం

ఆదోని సెంట్రల్: రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడా పోటీల్లో విద్యార్థి జగదీష్ రజత పథకం సాధించినట్లు పెద్దహరివాణం పాఠశాల హెచ్‌ఎం శంకరప్ప తెలిపారు. బుధవారం పాఠశాలలో పీఎంసీ చైర్మన్ బాలప్ప అధ్యక్షతన విద్యార్థి జగదీష్‌కు అభినందన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. అక్టోబర్ 19 నుంచి 21వ తేదీ వరకు జరిగిన ఖోఖో పోటీల్లో జగదీష్ రజత పతకం సాధించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాఠశాల నుండి హనుమేష్, నవీన్, సుమలత ఎంపికయ్యారని వారు కూడా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

జగనన్నకు రుణపడి ఉంటాం

దేవనకొండ: సీఎం వైఎస్ జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటానని కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. ఆమె బుధవారం సాయంత్రం స్వగ్రామమైన జిల్లెడబుడకలలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నేతల అరాచకాలతో విసిగిపోయి, జగనన్న ప్రజలను తన సొంత బిడ్డల్లా చూసుకుంటున్న పద్ధతి నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. తన మీద నమ్మకంతో పదవి ఇచ్చినందుకు జగనన్న నమ్మకాన్ని వమ్ము చేయనని, 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి తన వంతు కృషి



మాట్లాడుతున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ

చేస్తానని తెలిపారు. ఆమె భర్త, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు నింపాయని, ఇలాంటి ముఖ్యమంత్రి భావితరాలకు ఆదర్శమని కొనియాడారు. తమకు ఈ పదవి లభించేందుకు కృషి చేసిన పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు.

దేవరగట్టు బన్ని ఉత్సవాల్లో విషాదం



మృతుడు మాల గణేష్ (ఫైల్)

ఆస్పరి: దేవరగట్టులో బన్ని ఉత్సవాలను చూసేందుకు వెళ్లిన యువకుడు శవమై ఇంటికి చేరడంతో తల్లిదండ్రులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనతో ఆస్పరిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆస్పరికి చెందిన మాల వుశేని, సుజాతమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తె ఉన్నారు. కుమారుడు మాల గణేష్ (18) బేతంచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బైపీసీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులు రావడంతో గణేష్ స్వగ్రామానికి వచ్చాడు. మంగళవారం తోటి స్నేహితులతో కలసి దేవరగట్టులో జరిగే ఉత్సవాలను చూసేందుకు వెళ్లారు. అక్కడ చెట్టు కింద నిలబడిఉండగా ఒక్కసారిగా కొమ్మలు విరిగి గణేష్‌పై పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. దైవకార్యాన్ని చూసేందుకు వెళ్లి ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. ఆలూరులో పోస్టుమార్టం తరువాత బుధవారం స్వగ్రామమైన ఆస్పరికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

ఆస్పరి/ఆలూరు రూరల్: దేవరగట్టులో చెట్టు విరిగి పడిన ఘటనలో మృతి చెందిన గణేష్ (18), రామాంజినేయులు (49) కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. బుధవారం ఆస్పరిలో గణేష్, మొలగవల్లి కొట్టాలలో రామాంజినేయులు మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు,కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవ రెడ్డి, రంగన్న, గఫూర్, వీరేష్, చిన్న ఈరన్న, శ్రీరాములు తదితరులు నివాళులర్పించారు.



పైపును పట్టుకుని పల్టీలు వేస్తున్న యువకులు



వీపుపై గ్యాస్ సిలిండర్ కొక్కీలకు కట్టుకుని, కాళ్లకు కొక్కీలతో తలకిందులుగా నడుస్తున్న యువకుడు

సాహసం అదుర్స్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో దసరా పండుగ పురస్కరించుకొని యువకులు రెండవ రోజు బుధవారం తాము నేర్చుకున్న విన్యాసాలు ప్రదర్శించారు. సినిమాలను తలపించే రియల్ విన్యాసాలు చూసిన ప్రతి ఒక్కరికి ఒళ్లు గగుర్పొడిచే విధంగా సాహసం చేశారు. వీపునకు కొక్కీలు గుచ్చుకొని ట్రాక్టర్ లాగడం, వీపునకు కడ్డీలు గుచ్చుకొని గ్యాస్ సిలిండర్లను కట్టి పైకి లాగడం, కాళ్లకు కొక్కీలు కట్టుకొని వీపుకు చిన్న గ్యాస్ సిలిండర్ కట్టుకొని తలకిందులుగా నడవడం, ఇనుప పైపు చుట్టూ యువకులు పల్టీలు కొట్టడం, కర్రసాము, కుస్తీలు, పల్టీలు కొట్టడంతో పాటు రకరకాల విన్యాసాలు అబ్బురపరిచాయి.

పేదల ఆరోగ్యానికి భరోసా

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి అన్ని చోట్ల మంచి స్పందన లభిస్తోందని డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య అన్నారు. వెల్దుర్తి సచివాలయం–2 పరిధిలోని ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన హెల్త్ క్యాంపును ఆయన పరిశీలించారు. వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరం ద్వారా 511 మందికి వైద్య సేవలు అందించినట్లు రామళ్లకోట పీహెచ్‌సీ వైద్య బృందం తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ వెంకటనాయుడు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శివారెడ్డి గౌడ్ పేర్కొన్నారు. బుధవారం నందవరం గ్రామ సచివాలయం–1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయనతో పాటు గ్రామ సర్పంచ్ తోట సావిత్రి పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని కొనియాడారు. వైద్యరంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం మాత శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. వైద్య శిబిరంలో డాక్టర్లు 650 మందికి చికిత్స చేశారు. 77 మందికి కంటి పరీక్షలు చేసి 12 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సోగనూరు గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు చేసిన వారిలో అవసరమైన వారికి ఆపరేషన్ల కోసం సిఫార్సు చేసినట్లు వైద్యులు తెలిపారు. సర్పంచ్ లక్ష్మీకాంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు భీమిరెడ్డి, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గోనెగండ్ల: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు డాక్టర్ కార్తీక్ పేర్కొరు. బుధవారం మండలంలోని పెద్దమరివీడు పాఠశాలలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు అపర్ణ, పృథ్వీ, శ్రీదేవి దాదాపు 420 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మౌనిక, పంచాయతీ కార్యదర్శి షేక్ అబ్దుల్లా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో సర్పంచ్ అత్తావుల్లా ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు కళ్యాణ్ రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దాదాపు 380 మందికి పైగా ప్రజలు వైద్య చికిత్సలు చేయించుకున్నట్లు చెప్పారు. ఎంపీహెచ్‌ఈఓ రంగస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హాలహర్వి: ప్రతిఒక్కరూ సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ నాగేష్, ఎంపీడీఓ ఆంతోని, తహసీల్దార్ మల్లికార్జునస్వామి సూచించారు. మండలంలోని బేవినహాల్ గ్రామంలో సర్పంచ్ కె.జయశ్రీ ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ వైద్యులు ఈరన్న, మన్సూర్‌వలీ రోగులకు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ తదితర 14 రకాల ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.



వెల్దుర్తిలో హెల్త్ క్యాంపును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య



నందవరంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



పెద్దమరివీడులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



ప్యాలకుర్తిలో ఆరోగ్య కిట్టును అందజేస్తున్న వైద్యులు



బేవినహాల్ గ్రామంలో పౌష్టికాహార స్టాళ్లను పరిశీలిస్తున్న అధికారులు